# పోలింగ్ సరళిపై చర్చోపచర్చలు

**కులాలు, వర్గాలవారీగా పార్టీల విశ్లేషణలు • ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలపై ప్రజల్లో అనుమానాలు**

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు మూడు నెలలుగా నెలకొన్న ఎన్నికల వాతావరణం, ప్రధాన అంకం పోలింగ్‌తో ముగిసింది. ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఇప్పుడు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌ల వారీగా, సామాజిక వర్గాల వారీగా కూడికలు, తీసివేతల్లో తల మునకలయ్యారు. పోలింగ్ సరళి, ఏ వర్గం ఓటరు ఎటువైపు మొగ్గుచూపారు? అందులో తమ వాటా ఎంత? అనే విశ్లేషణలో ప్రధాన పార్టీలు లెక్కలు తీస్తున్నాయి. అదే క్రమంలో గత ఎన్నికల్లో పార్టీ బలాబలాలు, ఓటింగ్ శాతంతో పోలిస్తే ప్రస్తుతం వీచిందని చెప్తున్న గాలిలో నిజమెంత? వ్యక్తిగత అభిప్రాయాలు సామూహిక వాస్తవాలను ఎగ్జిట్‌పోల్స్ ఏ మాత్రం అంచనా వేశాయి? ఓటరు నాడిని అవి ఎంతవరకు పట్టుకున్నాయి? అన్నది మరో రోజు గడిస్తే కానీ తెలియదు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ గత ఎన్నికల ట్రాక్ రికార్డును పరిగణనలోకి తీసుకుంటే ఎంతగాలి వీచినా గతంలో వచ్చిన మెజారిటీలు తగ్గిపోయినా సీటు గ్యారెంటీ అనుకునే నియోజకవర్గాలేమిటన్న అంశం రాజకీయ విశ్లేషకులు దృష్టి సారించారు. గత ఎన్నికల్లో 20 వేల నుంచి లక్షకు పైగా మెజారిటీ వచ్చిన నియోజకవర్గాలు 69 ఉన్నాయి. అందులో 61 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ గెలిచిన 88 నియోజకవర్గాల్లో 61 మంది ఎమ్మెల్యేలకు 20 వేల నుంచి లక్షకు పైగా మెజారిటీలు వచ్చినవి ఉన్నాయి. ఎంఐఎం 5 నియోజకవర్గాలు, కాంగ్రెస్ పార్టీకి రెండు చోట్ల మాత్రమే 20 వేల పైచిలుకు మెజారిటీ రావడం గమనార్హం. అయితే ప్రస్తుతం బయట వీస్తున్న గాలి.. లేదా వీచిన గాలి అని చెప్పుకున్నది నిజమేనని అనుకున్నా మెజారిటీ తగ్గుతుందే తప్ప బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలన్నంత కసి ప్రజల్లో లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇండియా టుడే సర్వేనే అందుకు నిదర్శనంగా చూపుతున్నారు. ఇండియా టుడే సర్వేలో 32 శాతం రాష్ట్ర ప్రజలు కేసీఆర్ మరోసారి సీఎం కావాలని బలంగా కోరుకుంటున్నారని, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డికి 21 శాతం, తక్కిన నేతలు ఎవరైనా ఫర్వాలేదని 22 శాతం చెప్తున్నారని తేలింది. అంటే కచ్చితంగా మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్న ధీమాకు ఇది సంకేతమని చెప్తున్నారు. పైపెచ్చు ఉమ్మడి రాష్ట్రం నుంచి 2014, 2018 దాకా ఎన్నికల చరిత్ర చూసుకుంటే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఏనాడూ 50 సీట్లకు మించి పెరగలేదని అంటున్నారు.

### ముఖ్యనేతలతో సీఎం కేసీఆర్ సంభాషణ

మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుసహా అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిధులు, మరికొంత మంది ముఖ్యనాయకులు శుక్రవారం సీఎం కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ఎన్నికల్లో పోలింగ్ సరళి తదితర అంశాలను లోతుగా విశ్లేషించినట్టు తెలిసింది. 'మళ్లీ మనమే గెలుస్తున్నాం. ప్రజలు మనకే స్పష్టమైన అధికారం ఇవ్వబోతున్నారు' అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారని సమాచారం.

### సర్వేల్లో నిజమెంత?

పోలింగ్ అనంతరం వెల్లడైన ఎగ్జిట్‌పోల్స్, ఇండియా టుడే వంటి జాతీయ మీడియా సంస్థ వెల్లడించిన సర్వేల్లో నిజమెంత? అనే ఉత్కంఠలో రాజకీయ పార్టీలున్నాయి. ఎగ్జిట్‌పోల్స్ ఎగ్జాట్‌పోల్స్ సర్వేలుగా ఉంటాయని, ఆ ఫలితాలే నిజం అవుతాయని చెప్పటానికి వీల్లేదని రాజకీయ పండితులు అంటున్నారు. గతంలో అనేక ఎన్నికల సందర్భంగా అలాగే జరిగిందని ఉదహరిస్తున్నారు. 2018లో ఒకటి రెండు మినహా తక్కిన సర్వేలన్నీ బీఆర్‌ఎస్ పార్టీ విషయంలో బొక్కబోర్లా పడ్డాయి.



కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న భద్రతా బలగాలు

## స్ట్రాంగ్ రూమ్స్ వద్ద భారీ బందోస్తు

• విధుల్లో అగ్నిమాపక సిబ్బంది

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణవ్యాప్తంగా స్ట్రాంగ్ రూమ్స్ వద్ద భారీ బందోబస్తు కొనసాగిస్తున్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్లను భద్రపరిచిన చోట కేంద్ర బలగాలు గస్తీ కాస్తున్నాయి. అన్ని స్ట్రాంగ్ రూముల్లో మూడంచెల భద్రత కొనసాగిస్తున్నారు. ఇప్పటికే స్ట్రాంగ్‌రూమ్స్ పరిసరాలన్నీ సీసీ కెమెరాల ఆధీనంలో ఉన్నాయి. స్ట్రాంగ్ రూములున్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు.. భద్రతాపరమైన ఆంక్షలు విధించారు. వాటి చుట్టుపక్కలకు ఎవరూ రాకుండా చర్యలు తీసుకొంటున్నారు. కేంద్ర బలగాలతోపాటు రాష్ట్ర అగ్నిమాపక సిబ్బంది సైతం విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగినా వెంటనే స్పందించేందుకు కొన్ని చోట్ల అగ్నిమాపక యంత్రాలతో మోహరించారు.

## ఫలితాలపై ఏపీలో బెట్టింగ్

• *నియోజకవర్గాలు, అభ్యర్థుల వారీగా..*
• *బీఆర్‌ఎస్ గెలుపుపైనే భారీగా పందెం*

*హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ఎగ్జిట్ పోల్స్‌లో కూడా స్పష్టత రాకపోవడంతో ఈ ఫీవర్ ఏపీ, కర్ణాటకకు సైతం తాకింది. దీంతో బెట్టింగ్ జోరందుకున్నది. నియోజకవర్గాలు, అభ్యర్థుల వారీగా భారీగా పందేలు కాస్తున్నట్టు తెలుస్తున్నది. చాలామంది బీఆర్‌ఎస్ గెలుపు, కేసీఆర్ వ్యూహరచనపై నమ్మకం పెట్టుకున్నట్టు సమాచారం. ఒక్కో బెట్టింగ్ రూ.10 లక్షలు మొదలుకొని కోటికి పైగా నడుస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యంగా ఏపీకి చెందిన కొందరు పందెం రాయుళ్లు భారీస్థాయిలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు నిఘా వర్గాల ద్వారా తెలిసింది. అటు ఏపీతో పాటు ఇటు తెలంగాణలో సైతం బెట్టింగ్ ఊపందుకున్నది. నియోజకవర్గ అభ్యర్థిపై బెట్టింగ్‌తో పాటు కచ్చితంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని బెట్టింగ్‌లకు దిగుతున్నారు. ఎంఐఎం, బీఆర్‌ఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయనే అంశంపై జోరుగా బెట్టింగ్‌లు నడుస్తున్నట్టు సమాచారం. పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.*

# తగ్గిన పోలింగ్ శాతం

మొదటిపేజీ తరువాయి...

ఓటింగ్ శాతం తక్కువగా నమోదయ్యింది. అన్ని విషయాల్లో బాధ్యతాయుతంగా ఉండే మహానగర ఓటర్లు ఎన్నికల్లో మాత్రం చివరిస్థానంలో నిలుస్తున్నారు. ఏ ఎన్నికలైనా 50 శాతానికి మించి పోలింగ్ నమోదుకావడం లేదు. 2018 ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలో 48.89 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ సారి 47.88 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. అంటే గతంతో పోల్చితే 1.01 శాతం తక్కువగానే నమోదయ్యింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే హైదరాబాద్‌లో అత్యల్పంగా పోలింగ్ జరుగడం శోచనీయం. జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో పరిశీలిస్తే గోషామహల్‌లో 55.38 శాతం నమోదు కాగా, అతి తక్కువగా యాకుత్‌పురలో 39.64 శాతం నమోదయ్యింది. ఓటింగ్‌లో పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పురుషులు 11,29,959 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 10,42,087 మంది మహిళలు సద్వినియోగం చేసుకొన్నారు.

### కాలు కదపని గ్రేటర్ ఓటరు

మహానగరంలో కోటి మందికి పైగా నివసిస్తున్నారు. అయితే గ్రేటర్ ఓటర్లు ప్రతిసారి ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతున్నది. ఓటర్లలో నిర్లిప్తతతో పోలింగ్ కేంద్రాలకు రావడం లేదనే విమర్శలున్నాయి. ఉత్సాహంగా ఓటు వేసేలా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టిసారించినా ముఖ్యంగా చదువుకున్న వారు, ఐటీ ఉద్యోగులు, యువత ఓటువేసేందుకు నిరాసక్తత చూపుతున్నారు. దీంతో ఎన్నికలు ఏవైనా పోలింగ్ 50శాతానికి దాటడం లేదు.



### గ్రేటర్ హైదరాబాద్‌లో నమోదైన పోలింగ్

| జిల్లా | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓటర్లు | శాతం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 11,29,959 | 10,42,087 | 65 | 21,72,111 | 47.88 |
| మేడ్చల్ | 8,12,540 | 7,71,052 | 83 | 15,83,675 | 56.17 |
| రంగారెడ్డి | 7,84,414 | 7,37,080 | 65 | 15,21,559 | 59.96 |

### జిల్లాలవారీగా నమోదైన పోలింగ్

| జిల్లా పేరు | ఓటింగ్ శాతం |
|---|---|
| ఆదిలాబాద్ | 79.90 |
| భద్రాద్రి కొత్తగూడెం | 80.20 |
| హనుమకొండ | 68.81 |
| హైదరాబాద్ | 47.88 |
| జగిత్యాల | 76.83 |
| జనగామ | 86.34 |
| జయశంకర్ భూపాలపల్లి | 82.02 |
| జోగులాంబ గద్వాల | 82.82 |
| కామారెడ్డి | 79.92 |
| కరీంనగర్ | 75.31 |
| ఖమ్మం | 83.83 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 81.31 |
| మహబూబాబాద్ | 84.83 |
| మహబూబ్‌నగర్ | 78.08 |
| మంచిర్యాల | 75.66 |
| మెదక్ | 86.73 |
| మేడ్చల్ మల్కాజిగిరి | 56.17 |
| ములుగు | 82.09 |
| నాగర్‌కర్నూల్ | 80.04 |
| నల్లగొండ | 85.71 |
| నారాయణపేట | 77.73 |
| నిర్మల్ | 78.69 |
| నిజామాబాద్ | 74.68 |
| పెద్దపల్లి | 77.96 |
| రాజన్న సిరిసిల్ల | 77.68 |
| రంగారెడ్డి | 59.94 |
| సంగారెడ్డి | 76.99 |
| సిద్దిపేట | 83.05 |
| సూర్యాపేట | 85.99 |
| వికారాబాద్ | 76.99 |
| వనపర్తి | 77.72 |
| వరంగల్ | 78.03 |
| యాదాద్రి భువనగిరి | 90.36 |
| మొత్తం | 71.34 |

## లోకం పోకడ




ఏ పనికైనా ముందుచూపు ఉండాలంటావ్ కదా.. పద.. తులం లక్ష కాకముందే ఓ కేజీ బంగారం కొందాం!

## ఏపీకి తుఫాన్ ముప్పు

• మచిలీపట్నం తీరం దాటనున్న 'మిచాంగ్'



హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఏపీకి మిచాంగ్ తుఫాను ముప్పు పొంచిఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదివారం నాటికి తుఫాను మచిలీపట్నం సముద్ర తీరం దాటనున్నదని పేర్కొన్నది. ఈ ప్రభావంతో ఆదివారం నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తుఫాను కారణంగా అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ అలర్ట్ చేసింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 15.3°c | 32.7°c |
| మెదక్ | 17.3°c | 32.8°c |
| ఆదిలాబాద్ | 17.4°c | 35.8°c |
| వరంగల్ | 19.0°c | 32.0°c |
| మహబూబ్‌నగర్ | 19.0°c | 32.4°c |
| నిజామాబాద్ | 19.7°c | 29.5 °c |
| హైదరాబాద్ | 20.6°c | 29.8°c |
| కరీంనగర్ | 21.0°c | 31.0°c |
| ఖమ్మం | 21.0°c | 33.0°c |
| నల్లగొండ | 21.4°c | 34.9°c |

## రేపే కౌంటింగ్

మొదటిపేజీ తరువాయి...

*మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అయిన చాంద్రాయణగుట్టకు సంబంధించిన వీడియోపై నివేదిక అడిగామని వెల్లడించారు. నివేదిక వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవో సత్యవాణి పాల్గొన్నారు.*

## రేపు క్లాట్ ఎగ్జామ్

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా న్యాయ విశ్వవిద్యాలయాల్లోని 'లా' కోర్సుల్లో ప్రవేశాలకు కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)ను ఆఫ్‌లైన్‌లో ఆదివారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పరీక్ష కొనసాగనున్నది. పరీక్ష రాసే అభ్యర్థులు ఒంటిగంట కల్లా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని క్లాట్ అధికారులు సూచించారు. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తవచ్చని, కావున అభ్యర్థులు వీలైనంత త్వరగా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

## తమిళనాడులో ఈడీ అధికారి అరెస్టు

• *లంచం తీసుకుంటుండగా పట్టుకున్న పోలీసులు*

చెన్నై, డిసెంబర్ 1: తమిళనాడులో అంకిత్ తివారీ అనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీనియర్ అధికారి లంచాన్ని స్వీకరిస్తూ పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దుండిగల్ జిల్లాలో ఓ వైద్యుడి నుంచి రూ.20 లక్షల లంచం స్వీకరిస్తున్న ఆయనను అరెస్టు చేసినట్టు ఆ రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం డీవీఏసీ శుక్రవారం వెల్లడించింది. కారులో ప్రయాణిస్తున్న అంకిత్ తివారీని దుండిగల్ పోలీసుల సాయంతో ఓ టోల్‌గేట్ వద్ద ఆపి అరెస్టు చేసినట్టు పేర్కొన్నది. ఈ సందర్భంగా ఆయన నుంచి ఓ గుర్తింపు కార్డును స్వాధీనం చేసుకున్నామని, ఆయన ఈడీ అధికారిగా పనిచేస్తున్నట్టు ఆ ఐడీకార్డులో ఉన్నదని వివరించింది. అంకిత్ తివారీతో పాటు ఆయన బృందానికి చెందిన ఈడీ అధికారులు కేసుల మాఫీ పేరుతో అనేక మంది ప్రజలను బెదిరించి లంచాలను స్వీకరిస్తున్నట్టు తెలిపింది. తమిళనాడులో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలపై ఈడీ, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేస్తున్న తరుణంలో ఈ అరెస్టు జరగడం గమనార్హం. ఇసుక మైనింగ్ కేసులో ఇటీవల తమిళనాడులోని ఐదుగురు జిల్లా కలెక్టర్లకు ఈడీ జారీచేసిన సమన్లపై కొద్ది రోజుల క్రితం మద్రాస్ హైకోర్టు స్టే విధించింది.

# ఎన్నికలు ప్రశాంతం

• ఎక్కడా అవాంఛనీయ సంఘటనల్లేవు
• సమస్యాత్మక ప్రాంతాల్లో 'యాక్షన్ ప్లాన్'
• శాంతిభద్రతల నిర్వహణలో తెలంగాణ భేష్

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలంటే ఓ రణరంగం. ఆ రాజకీయ కురుక్షేత్రంలో రక్తం చిందని ఎన్నికల్లేవ్. ఎటుచూసినా పోటాపోటీ నినాదాలు.. తోపులాటలు, కర్ఫ్యూలు, 144 సెక్షన్లు, ఒక్కోసారి భాష్పవాయువుల ప్రయోగాలు. వీటికితోడు భారీస్థాయిలో రిగ్గింగులు, బ్యాలెట్ ఎత్తుకెళ్లే ఘటనలు. రోడ్లపై విర్రవీగుతూ చిందులేసే ప్రత్యర్థి వర్గాలు. ఒక్కో పోలింగ్ బూత్ వద్ద నలుగురైదుగురు పోలీసు సిబ్బంది పహారా కాస్తే.. బయట ఆయా పార్టీల కార్యకర్తలను చెదరగొట్టేందుకు మరో నలుగురైదుగురు సిబ్బంది ఉండాల్సి వచ్చేది. స్వరాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతలా పరిఢవిల్లుతున్నాయనే దానికి నిదర్శనం గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలు. ఎక్కడో ఓ చోట కొద్దిపాటి తోపులాటలు తప్పా.. ఒక్కటంటే ఒక్క భారీ సంఘటన జరిగిన దాఖలాలు లేవు. కేంద్ర ఎన్నికల సంఘానికి పోలీసు శాఖ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన 'ఎన్నికల యాక్షన్ ప్లాన్' విజయవంతంగా అమలైంది. చాలా చోట్ల యువ ఐపీఎస్ అధికారులు ముందుండి సిబ్బందిని నడిపించిన తీరు అద్భుతం. ఈ విషయాన్ని స్వయంగా డీజీపీ అంజనీకుమార్ ఆడియో సందేశంలో కొనియాడటం మరింత ఉత్సాహాన్ని ఇచ్చే అంశం.

### ఒక్కో బూత్‌లో ఒక్కరే భద్రతా సిబ్బంది..

4,400 సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ముగ్గురి నుంచి ఐదుగురి వరకు కేంద్ర బలగాలతో మోహరించారు. ముందుగానే ఓటర్లను చైతన్యపరిచి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకొన్నారు. సమస్యాత్మక ప్రాంతాల మినహా ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక్కో పోలింగ్ బూత్‌కు అవసరమైన చోట కానిస్టేబుల్, హోంగార్డు, ఎలాంటి ఇబ్బంది లేదనుకున్న చోట ఓ హోంగార్డు/కానిస్టేబుల్‌తోనే భద్రత నిర్వహించారు. అయినా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా.. ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొంటూ పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ దఫా ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో మావోయిస్టులు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. ఎన్నికలు నిర్వహిస్తుండగానే ఛత్తీస్‌గఢ్‌లో విధ్వంసాలకు పాల్పడ్డారు. అయితే, తెలంగాణలోని 13 మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఈ దఫా ఐదు రాష్ట్రాలకు చివరిగా జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఎంతో ప్రశాంతంగా జరిగాయని జాతీయ మీడియా సైతం కొనియాడింది. ఇక్కడి భద్రత, ఎన్నికల ప్లాన్‌ను ప్రభుత్వంతో కలిసి అమలు చేయడంలో ఎన్నికల సంఘం విజయం సాధించిందని ఉన్నతాధికారులు సైతం మెచ్చుకొన్నారు.

# ఆర్థికంలో శిఖరాగ్రం

మొదటిపేజీ తరువాయి...

జీఎస్‌డీపీ స్థిరంగా పెరుగుతూనే ఉన్నది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.4,51,580 కోట్లుగా ఉన్న తెలంగాణ జీఎస్‌డీపీ.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.13,13,391 కోట్లకు వృద్ధి చెందినట్టు రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) హ్యాండ్ బుక్ వెల్లడించింది. అంటే, గత పదేండ్లలో దాదాపు మూడు రెట్లు (291 శాతం) పెరిగింది. తద్వారా దేశ జీడీపీ (రూ.2,72,03,767 కోట్లు)లో తెలంగాణ వాటా 4.8 శాతంగా ఉన్నది. ఇది ఎన్నో పెద్ద రాష్ట్రాల వాటా కంటే ఎక్కువ. చివరికి కొవిడ్ సంక్షోభ సమయంలోనూ రాష్ట్రం జాతీయ సగటు కంటే అధిక వృద్ధిరేటును నమోదు చేసింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ మైనస్ 1.4 శాతానికి పడిపోగా.. తెలంగాణ మాత్రం 1.2 వృద్ధిరేటును నమోదు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది.


### జీఎస్‌డీపీ, జీడీపీ వృద్ధి తీరు

| ఆర్థిక సంవత్సరం | జీఎస్‌డీపీ (రూ.కోట్లలో) | జీడీపీ (రూ.కోట్లలో) | జీడీపీలో తెలంగాణ వాటా (శాతం) |
|---|---|---|---|
| 2013-14 | 4,51,580 | 1,12,33,511 | 4.0 |
| 2014-15 | 5,05,848 | 1,24,67,959 | 4.1 |
| 2015-16 | 5,77,902 | 1,37,71,874 | 4.2 |
| 2016-17 | 6,58,325 | 1,53,91,669 | 4.3 |
| 2017-18 | 7,50,050 | 1,70,90,042 | 4.4 |
| 2018-19 | 8,57,427 | 1,88,99,668 | 4.5 |
| 2019-20 | 9,50,090 | 2,00,74,856 | 4.7 |
| 2020-21 | 9,42,814 | 1,98,00,914 | 4.9 |
| 2021-22 | 11,28,907 | 2,36,64,639 | 4.9 |
| 2022-23 | 13,13,391 | 2,72,03,767 | 4.8 |

### తలసరి ఆదాయం వృద్ధి తీరు

| ఆర్థిక సంవత్సరం | తెలంగాణ తలసరి ఆదాయం (రూ.) | జాతీయ తలసరి ఆదాయం (రూ.) | తెలంగాణ వృద్ధిరేటు | జాతీయ వృద్ధిరేటు |
|---|---|---|---|---|
| 2013-14 | 1,12,162 | 79,118 | 11.0 | 11.5 |
| 2014-15 | 1,24,104 | 86,647 | 10.6 | 9.5 |
| 2015-16 | 1,40,840 | 94,797 | 13.5 | 9.4 |
| 2016-17 | 1,59,395 | 1,04,880 | 13.2 | 9.6 |
| 2017-18 | 1,79,358 | 1,15,224 | 12.5 | 10.9 |
| 2018-19 | 2,09,848 | 1,25,946 | 17.0 | 9.3 |
| 2019-20 | 2,30,955 | 1,32,115 | 10.3 | 4.9 |
| 2020-21 | 2,34,751 | 1,26,855 | 1.65 | -0.4 |
| 2021-22 | 2,78,833 | 1,50,007 | 19.2 | 18.3 |
| 2022-23 | 3,17,115 | 1,72,000 | 15.1 | 13.7 |

### తల'సిరి'లో తెలంగాణ నంబర్ వన్



*తలసరి ఆదాయం వృద్ధిలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.1,12,162గా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం.. 2022-23 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.3,17,115కు చేరింది. అంటే గత పదేండ్లలో దాదాపు మూడు రెట్లు (రూ.2,04,953) పెరిగింది. తలసరి ఆదాయంలో జాతీయ వృద్ధిరేటు 13.7 శాతం ఉండగా.. తెలంగాణ 15.1 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రంలోనూ ఇంత భారీ వృద్ధిరేటు నమోదు కాలేదు.*

## వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

• తిరుమలలో 23 నుంచి జనవరి 1 వరకు వైకుంఠ ద్వార దర్శనం
• 94 కౌంటర్ల ద్వారా 4.23 లక్షల టోకెన్లు
• టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల 23 నుంచి జనవరి 1 వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భక్తులు క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండటాన్ని నివారించేందుకు టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నామని చెప్పారు. 2.25 లక్షల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఈ నెల 10న ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. తిరుపతి, తిరుమలలోని 10 కేంద్రాల్లో 94 కౌంటర్ల ద్వారా ఈ నెల 22 నుంచి మొత్తం 4,23,500 టోకెన్లు మంజూరు చేస్తామని వివరించారు. దర్శన టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని స్పష్టంచేశారు. వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకు, డిసెంబరు 31, జనవరి 1న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలు రద్దు చేసినట్టు తెలిపారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. 5 కంపార్ట్‌మెంట్లు నిండిపోగా టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. గురువారం స్వామివారిని 58,278 మంది భక్తులు దర్శించుకోగా 17,220 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు వచ్చిందని పేర్కొన్నారు.

### టీటీడీకి రెండు బస్సులు విరాళం..

టీటీడీకి శుక్రవారం ఓ దాత రెండు బస్సులను విరాళంగా అందజేశారు. చెన్నైకి చెందిన ప్రముఖ విద్యా సంస్థ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నారాయణరావు రూ.80 లక్షల విలువైన రెండు బస్సుల తాళాలను ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.

### భక్తుల కోసం డైరీలు, క్యాలెండర్లు..

2024వ సంవత్సరం డైరీలు, క్యాలెండర్లు తిరుమల, తిరుపతితోపాటు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, వైజాగ్‌లోని శ్రీవారి ఆలయాలు, ముంబై, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ, కర్నూలులోని టీటీడీ కల్యాణమండపాల్లో అందుబాటులో ఉన్నాయని ఈవో తెలిపారు.

## నిపుణ – విద్య, ఉద్యోగ సమాచారం

### బెల్‌లో..

**భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 52
- పోస్టులు: ట్రెయినీ ఇంజినీర్, ప్రాజెక్ట్ ఇంజినీర్
- విభాగాలు: హెచ్‌ఆర్, మెటీరియల్ మేనేజ్‌మెంట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 15
- వెబ్‌సైట్: https://bel-india.in

### సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు

**సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 18
- పోస్టులు: అసిస్టెంట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 20
- వెబ్‌సైట్: https://cris.org.in

### టెక్నికల్ ఆఫీసర్లు

**ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్ (ఐపీఆర్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 22
- పోస్టులు: టెక్నికల్ ఆఫీసర్– సీ
- అర్హతలు: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 18
- వెబ్‌సైట్: https://www.ipr.res.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, పాలిటీ (గ్రూప్స్), ఐఐటీ/నీట్ ఫౌండేషన్ మ్యాథమెటిక్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.